సాక్షి కామారెడ్డి

శుక్రవారం : 25 : ఏప్రిల్ : 2025



పేద విద్యార్థుల కోసమే..

బాన్సువాడలోని శ్రీరాం నారాయణ్ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రజతోత్సవాలను గురువారం నిర్వహించారు.

- 10లో ▸



రోడ్లపై ధాన్యంతో ఇబ్బందులు

వరి పంటను నూర్పిడి చేసిన తర్వాత రైతులు వడ్లను రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం

44.8 /23.3

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. క్రమంగా ఎండతీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ కొమురయ్య



కామారెడ్డి టౌన్: నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య గురువారం కామారెడ్డిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, మౌలిక వసతులపై చర్చించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

6న ఇంటర్ విద్యార్థులకు మెగా జాబ్ మేళా

కామారెడ్డి క్రైం: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ టెక్–బీ ప్రోగ్రాం కోసం వచ్చేనెల 6 న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జాబ్ మేళా నిర్వహించనుంది. ఈ విషయాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ వొకేషనల్ కంప్యూటర్స్ కోర్సులలో 60 శాతానికిపైగా మార్కులు సాధించినవారు జాబ్ మేళాకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు పదో తరగతి, ఇంటర్మీడియట్ 2025 మెమోల జిరాక్స్‌లు, ఆధార్ కార్డు, ఆండ్రాయిడ్ ఫోన్‌లతో వచ్చేనెల 6న నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 80740 65803, 79818 34205 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో 'రుతుమతి' అభియాన్



కామారెడ్డి టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో, కళాశాలల్లో రుతుమతి అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యురాలు ప్రత్యూషరెడ్డి మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, రుతుస్రావాల సమస్యలు, సేఫ్టీ సానిటరీ ప్యాడ్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. సానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, దేశం బాగుంటాయని పేర్కొన్నారు. కళాశాలలో మహిళా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు వైష్ణవి, హారిక, విజ్ఞ, సంజన తదితరులు పాల్గొన్నారు.

'రమణ స్ఫూర్తిని కొనసాగించాలి'



కామారెడ్డి అర్బన్: టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కందుకూరి రమణ భౌతికంగా లేకున్నా ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీలో రమణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభకు తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ నాయకురాలు విమలక్క హాజరై రమణపై పాటలు పాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు, మాజీ నాయకులు తోట హన్మండ్లు, కె.వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల లింగం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రామారెడ్డి ఎస్సై సస్పెన్షన్

కామారెడ్డి క్రైం: విధుల్లో నిర్లక్ష్యాన్ని కనబరిచినందుకు జిల్లాలో మరో ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడింది. రామారెడ్డి ఎస్సై నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో గతేడాది ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఈ కేసు విచారణ విషయంలో ఫిర్యాదుదారు అనేకసార్లు పోలీసులను ఆశ్రయించినా విచారణ వేగవంతం చేయలేదు. కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయలేదు. ఈ విషయం ఇటీవల ఎస్పీ రాజేశ్ చంద్ర దృష్టికి వచ్చింది. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. విచారణ జరిపించగా కేసు 48 గంటల్లో కొలిక్కివచ్చింది. కేసు విచారణలో ఎస్సై నరేశ్ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంపై ఎస్పీ ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో సదరు ఎస్సైని సస్పెండ్ చేశారు.



రామారెడ్డి–మద్దికుంట మధ్య విస్తరణకు నోచుకోని రోడ్డు

ప్రగతిబాటకు అటవీ చిక్కులు

రోడ్డు, రవాణా సౌకర్యాలు ఉంటేనే పల్లెలు ప్రగతిబాటలో నడుస్తాయి. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారుల కోసం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటాయి. అయితే రోడ్ల నిర్మాణానికి అటవీ చిక్కులు ఆటంకంగా మారుతుండడంతో రవాణా ఇబ్బందులు తొలగడం లేదు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- ఏళ్లు గడుస్తున్నా తొలగని అడ్డంకులు
- అర్ధంతరంగా ఆగిన రోడ్ల నిర్మాణాలు
- అవస్థలు పడుతున్న గ్రామీణులు

సాక్షి ఫోకస్

జిల్లాలోని పలు రోడ్లకు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో నిధులున్నా దశాబ్దాలుగా పనులు పూర్తి కావడం లేదు. లింగంపేట మండలంలోని పోతాయిపల్లి నుంచి తాడ్వాయి మండలం నందివాడకు అటవీ ప్రాంతం నుంచి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రెండు గ్రామాల్లో అటవీ ప్రాంతం వరకు పనులు చేపట్టారు. అటవీ అనుమతులు లేకపోవడంతో 3.50 కిలోమీటర్ల మేర పనులు ముందుకు కదలడం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా పురోగతి లేదు. పోతాయిపల్లి నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చుట్టూరా తిరిగి వెళ్తే 35 కిలోమీటర్ల దూరం అవుతుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే దూరం 20 కిలోమీటర్లకు తగ్గుతుంది. 16 గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు సౌకర్యంగా ఉంటుంది. కానీ అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఇబ్బందులు తీరడం లేదు.



అటవీశాఖ అనుమతులు లేక ఆగిపోయిన పోతాయిపల్లి - నందివాడ రోడ్డు పనులు

అర్గొండ - కొండాపూర్ మధ్య..

కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డును రెండు వరుసలుగా అభివృద్ధి చేయడానికి గతంలోనే నిధులు మంజూరయ్యాయి. అయితే రాజంపేట మండలం అర్గొండ -కొండాపూర్ గ్రామాల మధ్య ఐదు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం ఉంది. ఈ రోడ్డు విస్తరణకు అటవీ అనుమతులు లభించకపోవడంతో అటవీ ప్రాంతంలో పనులు చేపట్టలేదు. అర్గొండ నుంచి కామారెడ్డి వరకు రెండు వరుసల రోడ్డు ఎప్పుడో పూర్తయ్యింది. కొండాపూర్ నుంచి గుండారం వరకు కూడా డబుల్ రోడ్డు పనులు పూర్తి చేశారు. అటవీ ప్రాంతంలో మాత్రం అలాగే ఉండిపోయింది.

రామారెడ్డి - మద్దికుంట మధ్యలో..

కామారెడ్డి నుంచి రామారెడ్డి మీదుగా రెడ్డిపేట వరకు రెండు వరుసల రోడ్డు పనులు చేపట్టారు. రామారెడ్డి – మద్దికుంట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో అనుమతులు లభించక రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఎటూ తేలడం లేదు. జిల్లాలోని పిట్లం, జుక్కల్, పెద్దకొడప్‌గల్, గాంధారి, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్ తదితర మండలాల్లో అటవీ చిక్కులతో పలు రోడ్ల పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం కూడా సమస్యగా మారింది.

పాలకులు చొరవ చూపాలి



మా ఊరి నుంచి నందివాడకు మధ్యలో అటవీ ప్రాంతం ఉంది. అటవీ శాఖ అనుమతులు రాక పనులు ఆగిపోయాయి. పదేళ్లు గడచినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కామారెడ్డికి వెళ్లడానికి మాకు 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలి.

– బాలయ్య, పోతాయిపల్లి, లింగంపేట మండలం

రోడ్డు మీద వెళ్లాలంటే ఇబ్బందే..



రాజంపేట మీదుగా మెదక్‌కు వెళ్లే రోడ్డులో కొండాపూర్, అర్గొండ గ్రామాల మధ్య ప్రమాదకరమైన మలుపులు, ఘాట్ సెక్షన్ ఉంటుంది. డబుల్ రోడ్డు కోసం నిధులు మంజూరైనా అటవీ అనుమతులు లేవని పనులు ఆపేశారు. ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డు మీద వెళ్లాలంటేనే భయమవుతుంది. అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– తిప్పారం శ్యాం, అర్గొండ, రాజంపేట మండలం

పట్టించుకోవడం లేదు



కామారెడ్డి నుంచి రామారెడ్డి ఊరు దాటేదాకా రెండు వరుసల రోడ్డు పూర్తయ్యింది. కొద్ది దూరం మాత్రమే అడవి ఉందని ఆపేశారు. ఈ ప్రాంతంలో రోడ్డు అంతా దెబ్బతిని ఇబ్బందిగా ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు అనుమతులు తీసుకువచ్చి ఆగిపోయిన పనులు పూర్తి చేయిస్తే ఇబ్బందులు తొలగుతాయి.

– మోహన్ నాయక్, జగదాంబతండా, రామారెడ్డి మండలం

రైస్‌మిల్లర్ల తీరుపై రైతాగ్రహం



రాస్తారోకో చేస్తున్న రైతులు

- నాగిరెడ్డిపేటలో అన్నదాతల రాస్తారోకో

నాగిరెడ్డిపేట: రైస్‌మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చీనూర్ గ్రామ రైతులు గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో చీనూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నుంచి ఏడు లారీలు ధాన్యం లోడ్‌తో రైస్‌మిల్లులకు వెళ్లాయి. ధాన్యం నాణ్యతగా లేదని మిల్లర్లు ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చేపట్టారు.విషయం తెలుసుకున్న సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, సివిల్‌సప్లై డీటీ సురేశ్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి ఎస్సైలు మల్లారెడ్డి, మహేశ్ రైతుల వద్దకు చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ప్రియుడి కోసం భర్తను చంపించిన భార్య



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

- ఏడాది తర్వాత వెలుగులోకి ఘటన
- వివరాలను వెల్లడించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి

రామారెడ్డి: ప్రియుడి కోసం భర్తనే హత్య చేయించిందో ఇల్లాలు. ఏడాది తర్వాత ఈ ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు.

రామారెడ్డి మండలం ఇసన్నపల్లికి చెందిన గొల్ల తిరుపతి(45) గతంలో గల్ఫ్ దేశంలో పనిచేసి రెండేళ్ల క్రితం సొంతూరుకు తిరిగి వచ్చాడు. కొంతకాలానికే కనిపించకుండా పోయాడు. 14 నెలలుగా తిరుపతి కనిపించకపోవడంతో అతడి అన్న గొల్ల నాగమల్లయ్య ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. తుది విచారణలో తిరుపతిని భార్యే హత్య చేయించినట్లు తేలిందని ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, క్రైం టీం సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

వివాహేతర సంబంధమే కారణం

గొల్ల తిరుపతి భార్య మణవ్వకు అదే గ్రామానికి చెందిన కందూరి లింబయ్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. తిరుపతి గల్ఫ్‌నుంచి తిరిగి రావడంతో వారికి అడ్డంకిగా మారాడు. దీంతో భార్య అతడి అడ్డు తొలగించుకోవాలని భావించి, హత్య చేయించడానికి కుట్ర పన్నింది. కందూరి లింబయ్య అతడి స్నేహితులైన షేక్ హయత్ బాషా, ధరణి లింబయ్యలతో మాట్లాడి తిరుపతిని హత్య చేయడానికి డబ్బులు ఇచ్చాడు. గతేడాది ఫిబ్రవరి 19న రాత్రి మద్యం తాగుదామంటూ తిరుపతిని వారు కారులో రామారెడ్డి నుంచి నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని డొంకల్ గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతడికి మద్యం తాగించి, మత్తులో ఉన్న సమయంలో మెడకు టవల్ చుట్టి హత్యచేశారు. అనంతరం పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగులబెట్టారు. మరుసటిరోజు ఎముకలను అక్కడే గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. తిరుపతి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ జరపగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు చూపిన ఆధారాల మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో గురువారం మృతుడి అవశేషాలు బయటకు తీసి పంచనామా నిర్వహించారు. నిందితులు కందూరి లింబయ్య ఏ–1గా, షేక్ హయత్ భాషా ఏ–2, ధరణి లింబయ్య ఏ–3, గొల్ల మణవ్వ ఏ–4గా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి కారు, బైకు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



బీర్కూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

బాన్సువాడ/నస్రుల్లాబాద్ : పట్టా పాసు పుస్తకాల్లో భూమి పటం, భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతిలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. గురువారం బీర్కూర్, నస్రుల్లాబాద్ రైతు వేదికలలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కారం అవుతాయన్నారు. సదస్సులలో బీర్కూర్ తహసీల్దార్ లత, నస్రుల్లాబాద్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, నస్రుల్లాబాద్ మండల ప్రత్యేకాధికారి దయానంద్, ఏడీఏ అరుణ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధన బీజేపీతోనే సాధ్యం

- ఎన్నికల్లో అంబేడ్కర్‌ను ఓడించింది కాంగ్రెస్సే
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న ప్రదీప్ కుమార్, వేదికపై ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: అంబేడ్కర్ ఆశయాల సాధన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేశారు. నెహ్రూ కుటుంబ సభ్యులకు భారతరత్న ఇచ్చిన కాంగ్రెస్‌కు.. అంబేడ్కర్‌కు ఇవ్వడానికి మాత్రం మనసు రాలేదని విమర్శించారు. చివరికి బీజేపీ భాగస్వామిగా ఉన్న సంకీర్ణ ప్రభుత్వమే అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చిందన్నారు. నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యేంతవరకు కూడా పార్లమెంట్ భవనంలో ఆ మహనీయుని విగ్రహం లేదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయించింది మోదీ ప్రభుత్వమేనన్నారు. గ్రామగ్రామాన సమావేశాలు నిర్వహించి అంబేడ్కర్ జీవిత చరిత్రపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కోరారు. అనంతరం జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రంజిత్ మోహన్, నరేందర్‌రెడ్డి, రాము, రవీందర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లం సాగు.. ఆదాయం బాగు



చద్మల్ తండా శివారులో సాగవుతున్న అల్లం



కోసిన అల్లంను శుభ్రం చేస్తున్న రైతులు

- ఎకరం విస్తీర్ణంలో అల్లం పండిస్తున్న యువ రైతు
- అంతర పంటగా మిర్చి సాగుతో అదనపు ప్రయోజనం



అల్లంలో అంతర పంటగా సాగు చేసిన మిరప

గాంధారి: చాలామంది రైతులు సాధారణ పంటలు సాగు చేస్తుండగా.. ఓ యువ రైతు భిన్న పథంలో సాగుతున్నాడు. చుట్టు పక్కల ఎవరూ సాగు చేయని అల్లం పంటను ఎంచుకుని, అంతర పంటగా మిర్చి సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నాడు చద్మల్ తండాకు చెందిన యువ రైతు బస్సీ రమేశ్. వివరాలిలా ఉన్నాయి. అల్లం సాగు చేయాలని నిర్ణయించుకున్న రమేశ్.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం మదనపల్లి నుంచి రూ. 13 వేలు వెచ్చించి ఆరు క్వింటాళ్ల అల్లం విత్తనం తెప్పించాడు. ఎకరం భూమిలో వెడల్పాటి సాళ్లు చేసి అల్లం విత్తాడు. సాళ్లలో డ్రిప్ పైపులను ఏర్పాటు చేసి నీరు అందించాడు. ఎనిమిది నుంచి పది నెలల పంటకాలం కాగా.. అంతర పంటగా మిరప సాగు చేశాడు. ప్రస్తుతం అల్లం పంట చేతికొచ్చింది. మార్కెట్‌లో క్వింటాలు అల్లం రూ. 5 వేల వరకు ధర పలుకుతోంది. ఎకరానికి 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, పెట్టుబడి ఖర్చులు పోను సుమారు రూ. లక్ష వరకు మిగులుతాయని రైతు తెలిపాడు. అంతర పంటగా సాగు చేసిన మిరప కూడా విరగ కాసింది. వారానికి రెండు క్వింటాళ్ల పచ్చిమిర్చి కోసి నిజామాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నాడు.

వాణిజ్య పంటలను సాగు చేయాలి



సాధారణ పంటలతో ఆశించిన దిగుబడి రాక నష్టపోతున్నాం. వాణిజ్య పంటలతో మంచి ఆదాయం పొందవచ్చు. యువ రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించి ఆదాయాన్నిచ్చే పంటలు సాగు చేసి ఆర్థికంగా ఎదగాలి.

– బస్సీ రమేశ్, రైతు, చద్మల్ తండా

క్లుప్తంగా

తెలుగు నవల రచయిత్రుల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే పోచారం, కాసుల

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు సయ్యద్ లతీఫ్ కుమార్తె డాక్టర్ సయ్యద్ ఆఫ్రీన్ బేగం రచించిన తెలుగు నవల రచయిత్రులు– ఒక పరిశీలన పుస్తకాన్ని గురువారం ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ముస్లిం యువతి తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ అందుకోవడం అభినందనీయమన్నారు. యూజీసీ నెట్, టీఎస్ సెట్ అర్హతలు పొంది తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేయడం గర్వకారణమన్నారు. పీహెచ్‌డీ చేస్తూ రూపొందించిన తెలుగు గ్రంథాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అంకితం ఇచ్చారు. తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్‌లో తెలుగు తులనాత్మక సాహిత్య శాఖలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆఫ్రీన్‌బేగంను గురువారం శ్రీరాం నారాయణ ఖేడియా సిల్వర్‌జూబ్లీ వేడుకల సందర్భం అభినందించారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవసేన, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్ కట్టకింది తండాకు చెందిన గురునాథ్‌పై అదే తండాకు చెందిన సోమేశ్వర్ పాగగొట్టంతో దాడి చేశాడు. ఈ ఘటనలో గురునాథ్ చేతికి, తలకు గాయాలైనట్లు ఎస్సై మహేష్ గురువారం తెలిపారు. గురునాథ్‌కు సోమేశ్వర్ ఇచ్చే డబ్బుల గురించి అడగడంతో దాడి చేశాడని బాధితుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సాయాగౌడ్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గడీరోడ్‌లో నివాసం ఉండే చించెలి సాయాగౌడ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. కూలీ పని చేసుకునే అతడు ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు చాలాచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య స్వరూప పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మామిడి తోట దగ్ధం

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో ఉన్న జాంగారి చంద్రారెడ్డికి చెందిన మామిడి తోట గురువారం దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు మామిడి తోటను దగ్ధం చేశారని బాధిత రైతు తెలిపారు. ఈ ఘటనలో తోటలోని విద్యుత్ తీగలు, పైప్ లైన్, మామిడి చెట్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు గురువారం మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర కో–ఆర్డినేషన్ కమిటీ ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా, ప్రతినిధులు యాలాద్రి, సునీత, నరసయ్య, వైశాలి, నిరంజన్, రమాదేవి, శ్రీకాంత్, సరిత, దిలిప్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసమే ప్రభుత్వ కళాశాలలు

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలలో పైలాన్‌ను ఆవిష్కరించిన పోచారం, షెట్కార్, అధికారులు

బాన్సువాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద విద్యార్థుల కోసమే ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, అందులోభాగంగానే బాన్సువాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీరాంనారాయణ్‌ఖేడియా (ఎస్‌ఆర్‌ఎన్‌కే) ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఇక్కడి ప్రజలు, విద్యార్థుల కోరిక మేరకు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడి 1997లో డిగ్రీ కళాశాల మంజురు జీవో విడుదల చేయించానన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కళాశాలలో 13053 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా, వారిలో సుమారు 10వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించడానికి అధ్యాపకుల కృషి చాలా ఉందని అన్నారు. కళాశాల కోసం శ్రీరాంనారాయణ్‌ఖేడియా తన 11.15 ఎకరాల ఫ్యాక్టరీ భూమిని ఉచితంగా ఇచ్చారని అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రావాల్సి ఉండగా, చివరి నిమిషంలో మంత్రి పర్యటన రద్దయిందని అన్నారు.

బాధ్యతగా ఉండాలి

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పట్టాతో కాకుండా మంచి వ్యక్తిత్వం, లక్ష్యంతో బయటకి రావాలని, భవిష్యత్‌లో విద్యనే కాకుండ, బాధ్యత కూడా ఉండాలని విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. తాను కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొట్టమొదటిసారిగా ఫీల్డ్ విజిట్‌కు రావాల్సివచ్చిందని, దీనికి కారణం పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని అన్నారు. కళాశాల కోసం స్థలం ఇచ్చిన గొప్ప వ్యక్తి శ్రీరాంనారాయణ్‌ఖేడియా అని అన్నారు. ఎల్లారెడ్డి, నారాయణ్‌ఖేడ్ డిగ్రీ కళాశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తప్పక రావాలని విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ఎంపీ సురేష్‌షెట్కార్ ఆహ్వానించారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. బాన్సువాడ, బోధన్ సబ్‌కలెక్టర్లు కిరణ్మయి, వికాస్ మహంత్, శ్రీరాంనారాయణ్‌ఖేడియా మనువడు రోహిత్ ఖేడియా, జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, బద్యనాయక్, కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి తదితరులు ఉన్నారు.

ఉగ్రదాడిలో మృతులకు నివాళులు



గాంధారిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



పాల్వంచలో..

సాక్షి నెట్‌వర్క్: జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన పర్యాటకులకు గురువారం జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ, స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ప్రతినిధులు, ప్రజలు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీలు చేపట్టారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. దాడికి కారకులైన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను తయారు చేస్తున్న పాకిస్తాన్‌తో తెగతెంపులు చేసుకోవాలని కోరారు.



జిల్లా కేంద్రంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నివాళి



తాడ్వాయిలో కొవ్వొత్తులతో ర్యాలీ



భిక్కనూరులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో..



బీబీపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీ నాయకులు

‘నమ్మకమైన వ్యాపారం చేయాలి’



వ్యాపారవేత్త సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న క్రెడా ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు నమ్మకమైన వ్యాపారం చేయాలని ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మన్నగారి సుభాష్‌రెడ్డి సూచించారు. కామారెడ్డి రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ (క్రెడా) కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం స్థానిక సిరిసిల్ల రోడ్డులోని రేణుకా దేవి కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త సుభాష్ రెడ్డి మాట్లాడుతూ భూమిని నమ్ముకున్న వారు ఎప్పటికీ నష్టపోరన్నారు. అనంతరం క్రెడా ప్రతినిధులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో క్రెడా అధ్యక్షుడిగా జి.లక్ష్మీనర్సాగౌడ్, ఉపాధ్యక్షుడిగా బి.దేవదాస్, ప్రధాన కార్యదర్శిగా బి.రాంచందర్ నాయక్, కోశాధికారిగా ఎం.రాజలింగం, సంయుక్త కార్యదర్శిగా వి.రాధ కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు.

పశువులకు టీకాలు వేయించాలి



వేల్పూర్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి రోహిత్‌రెడ్డి అన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మండలంలోని లక్కోరలో గురువారం తనిఖీ చేశారు. రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు భారం కాకుండా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు ఉచిత టీ కాలను వేయిస్తోందన్నారు.

మాక్లూర్ సొసైటీ డైరెక్టర్ రాజీనామా

మాక్లూర్: మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘం మాదాపూర్ డైరెక్టర్– 2 పదవికి జిట్టా చిన్న గంగాధర్ రాజీనామా చేశారు. గురువారం జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి శ్రీనివాస్‌కు లేఖను అందజేశారు. సొసైటీలో జరుగుతున్న అంతులేని అవినీతిని చూసి తట్టుకోలేకే రాజీనామా చేస్తున్నట్లు గంగాధర్ పేర్కొన్నారు. సొసైటీ అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని గంగాధర్ ‘సాక్షి’తో చెప్పారు.

మానవత్వం చాటిన కలెక్టర్



నస్రుల్లాబాద్‌లో క్షతగాత్రులను తన వాహనంలో తరలించాలని సూచిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నస్రుల్లాబాద్: కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మానవత్వం చాటుకున్నారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండాకు చెందిన గుగ్లోత్ మాంగ్యా, గుగ్లోత్ దేమ్యా గురువారం మండల కేంద్రం నుంచి తండాకు బైక్‌పై బయలుదేరారు. బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు సమీపంలో వీరి బైకు అదుపు తప్పడంతో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలో పర్యటించి తిరుగు ప్రయాణంలో జిల్లాకేంద్రానికి వెళుతుండగా క్షతగాత్రులను చూసి ఆగారు. వెంటనే వారిని ఆయన కారులో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బందిని తోడుగా ఇచ్చి పంపించారు. అంబులెన్స్ వచ్చేవరకు చూడకుండా కలెక్టర్ సొంత వాహనంలో క్షతగాత్రులను పంపడంపై కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తెయూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా వాసం చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా వాసం చంద్రశేఖర్ నియామకమయ్యారు. ఈమేరకు తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి గురువారం చంద్రశేఖర్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం వర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా వాసం చంద్రశేఖర్ కొనసాగుతున్నారు. వర్సిటీ ఎన్‌ఈపీ నోడల్ ఆఫీసర్‌గా, రూసా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మిని గురువారం ఆమె కార్యాలయంలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో న్యాయ వ్యవస్థ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదివసంతరావు తదితరులుపాల్గొన్నారు.

క్రైం కార్నర్

రామారెడ్డిలో ఒకరి ఆత్మహత్య



చిన్న భీమయ్య (ఫైల్)

రామారెడ్డి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డికి చెందిన మంగలి చిన్న భీమయ్య (49) బుధవారం రాత్రి కుటుంబ సభ్యులందరితో కలిసి భోజనం చేశారు. మనుమరాల్ని భీమయ్య కొట్టడంతో ఎందుకు కొట్టావని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. ఈక్రమంలో అతడు కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. కొద్దిసేపటికి గొడవ సద్దుమణిగిన తర్వాత నిద్రిస్తున్న సమయంలో భీమయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఉదయం కోడలు లేచే సమయానికి కొన ఊపిరితో ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై రవీందర్ తెలిపారు.

ఎక్లాస్‌పూర్ కార్యదర్శిపై విచారణ



విచారణ జరుపుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ జీపీ కార్యదర్శి పనితీరుపై గురువారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు విచారణ జరిపారు. కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో డీపీవో గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. అనంతరం రుద్రూర్ మండల కేంద్రంలో నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో డీపీవో పాల్గొని, జీపీ కార్మికులను సన్మానించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. డీఎల్‌పీవో నాగరాజు, జీపీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో గురువారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. వారి నుంచి రూ.1,180 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

ధాన్యం లారీ బోల్తా



ధర్పల్లి: మండలంలోని వాడీ వాగు వద్ద వరి ధాన్యాన్ని తరలిస్తున్న లారీ బుధవారం రాత్రి అదుపుతప్పి బోల్తా పడింది. హొన్నాజీపేట్ ఐకేపీ కేంద్రం నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో నిజామాబాద్ రైస్‌మిల్‌కు తరలిస్తుండగా వాగు వద్దనున్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. లారీ బోల్తా పడడంతో ధాన్యం బస్తాలను మరో లారీలో రైస్‌మిల్‌కు కేంద్రం నిర్వాహకులు తరలించారు.

కొడిచర్లలో ఇసుక ట్రాక్టర్..



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. మంజీరా నది నుంచి గురువారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా అదుపుతప్పి సమీపంలోని పొదల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు బోధన్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో పాత జాతీయ రహదారిపై హార్వేస్టర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్‌కు చెందిన మణికాంత్‌రెడ్డి(31) బుధవారం రాత్రి కాలినడకన రోడ్డుపై వెళ్తుండగా బాల్కొండ వైపు నుంచి ముప్కాల్ వైపు వస్తున్న హార్వేస్టర్ ఢీకొట్టి, ఆయన పైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఏలేటి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వృద్ధుడు..



పెంటయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చింతచెట్టు పైనుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన చాకలి పెంటయ్య(67) ఇటీవల మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో గల తన బంధువైన చిన్నమోల్ల శివలీల ఇంటికి వచ్చాడు. కాగా బుధవారం పెంటయ్య నాగిరెడ్డిపేటలోని తన బంధువు ఇంటివెనక గల చింతచెట్టు పైకెక్కి చింత కాయలు తెంపే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడికి గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..



మృతి చెందిన రాజేందర్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మిట్టాపల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. డిచ్‌పల్లి ఎస్సై మహ్మద్ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నాయికిడి రాజేందర్ (40), అదే గ్రామానికి చెందిన బంధువు నాయికిడి రవితో కలిసి గురువారం ఉదయం బైక్‌పై రాంపూర్ గ్రామానికి వెళ్లారు. కొద్ది సేపటికి తిరిగి డిచ్‌పల్లికి వస్తుండగా మిట్టాపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెళ్లింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే వారిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రవి పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. ఇంకా పెళ్లి కాలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. రెండు రోజుల క్రితమే గ్రామానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంతలోనే ఇలా మృతిచెందడం బాధాకరమైన విషయమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజేందర్ చెల్లెలు కొండూరు లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..

రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రానికి చెందిన మోతిలాల్(42) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. 20 రోజుల కిందట ఇంట్లో గ్యాస్ సిలెండర్ లీకయి అగ్ని ప్రమాదం జరుగగా మోతిలాల్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..



బాపురాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఆకుల చిన్న బాపురాజు (45) వ్యవసాయం చేసుకునేవాడు. బుధవారం ఉదయం మెదక్ జిల్లాకు చెందిన ఓ దంపతులు అతడి ఇంటికి వచ్చి అదే గ్రామంలో మరో ఇద్దరు వ్యక్తులు తీసుకున్న అప్పుకు గ్యారెంటర్‌గా ఉన్న విషయంలో మాట్లాడారు. అప్పు తీసుకున్న వారి ఇంటికి తీసుకువెళ్తానని చెప్పి బాపురాజు వారితో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 12 గంటల ప్రాంతంలో బాపురాజును గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులైన శ్రీనివాస్, రాజశేఖర్‌లు ఇంటికి తీసుకువచ్చి పడుకోబెట్టి వెళ్లిపోయారు. బాపురాజు భార్య శకుంతల అడిగితే మద్యం మత్తులో ఉన్నాడని చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంత లేపినా లేవకపోవడంతో అనుమానం వచ్చి అతడిని కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తలకు గాయం ఉండటంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

గజ్వేల్‌లో చుక్కాపూర్ వాసి..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఒకరు సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో గురువారం అనుమానాస్పదంగా మృతిచెందినట్టు గ్రామస్తులు గురువారం తెలిపారు. మూడు రోజుల కిందట కొమురవెల్లిలో కొబ్బరికాయలు అమ్మడానికి వెళ్లిన పర్శరాములు (40) గజ్వేల్ శివారులో అనుమానాస్పదంగా చనిపోయి ఉన్నట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు, చుక్కాపూర్ గ్రామస్తులు అక్కడికి వెళ్లారు.

చెరువులో పడి బాలుడు..



రుత్విక్‌రాజ్ (ఫైల్)

మాచారెడ్డి: చెరువులో పడి నాలుగేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన గురువారం పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలో చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డికి చెందిన దండబోయిన రుత్విక్‌రాజ్ (4) అనే బాలుడు తల్లిదండ్రులతో కలిసి భవానీపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి దర్శనం కోసం వచ్చారు. తల్లిదండ్రులు పూజలో నిమగ్నమై ఉండగా రుత్విక్‌రాజ్ ఆడుకుంటూ తప్పిపోయాడు. సాయంత్రం వరకు గ్రామ శివారులో వెతుకుతుండగా భవానీపేట చెరువులో శవమై తేలాడు. దీంతో ఆగ్రహం చెందిన రామారెడ్డి గ్రామస్తులు చెరువులో గుంతలు తీయడం వల్లే బాలుడు మృతి చెందాడని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న మాచారెడ్డి ఎస్సై అనిల్ పోలీసు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

గుర్తుతెలియని వృద్ధురాలు..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని పాతూరులో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. నందిపేటలోని పాతూర్ గ్రామ శివారులో సుమారు మూడు నాలుగు రోజుల క్రితం మలవిసర్జనకై ఆమె వెళ్లగా కుడి కాలికి ఉన్న వెండి కడియం, గెట్టుపై ఉన్న ఇనుప కంచకు తట్టుకొని ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయినట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతురాలు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతురాలి ఒంటిపైన పసుపురంగు చీర, గులాబీరంగు స్వెటర్, కుడి కాలికి వెండి కడియం ఉన్నదన్నారు. స్థానికుడు వాసవి రామ్‌చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు



కామారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న లాల్ సింగ్ శ్రీనివాస్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో సత్కరించారు. ఆయన మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా న్యాయమూర్తి వి. ఆర్.ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ఉత్తమ సేవలు అందిస్తేనే మంచి గుర్తింపు వస్తుందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాణి, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు సుమలత, సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫిజయోథెరపీలో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన తస్నీం ఫాతిమా వొకేషనల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట జూనియర్ కళాశాలలో ఫిజియోథెరపి చదువుతున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో తస్నీం ఫాతిమా రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఆ విద్యార్థిని కళాశాల చైర్మన్ గురువేందర్, ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణ, అధ్యాపకులు, అభినందించారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ర్యాంకు సాధించినట్లు విద్యార్థిని పేర్కొన్నారు.

ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం



కామారెడ్డి టౌన్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇది పిరికి పందల చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధితుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఆర్మీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి దేశభద్రతను పెంచాలన్నారు. నాయకులు నర్సింలు, అరుణ్ కుమార్, శ్రీనివాస్, సత్యం తదితరులున్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పథకంలో కొలతల ప్రకారం పనిచేసినట్లయితే పనికి తగ్గ వేతనం వస్తుందని ఏపీవో కృష్ణా గౌడ్ అన్నారు. ఆయన గురువారం ఎండ్రియాల్ శివారులో నడుస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్మాణం, పండ్లతోటల పెంపకం, నూతన భవన నిర్మాణం తదితర పనులను ఉపాధి హామీలో చేసుకోవచ్చన్నారు.

బసవేశ్వరాలయంలో సప్తాహం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం బస్వాపూర్‌లో బసవేశ్వరాలయంలో గురువారం పాండురంగ విఠలేశ్వర సప్తాహం ప్రారంభించారు. బసవేశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఏడు రోజుల పాటు సప్తాహం నిర్వహిస్తున్నామని రవి పటేల్ తెలిపారు. అంతేశ్వర్ గురూజీ, కిరణ్ మహరాజ్, గంగాధర్ మహరాజ్ ఆధ్వర్యంలో సప్తాహం కొనసాగుతుందన్నారు. చుట్టు ప్రక్క గ్రామాల భక్తులు సప్తాహానికి తరలి వచ్చి సంకీర్తనల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ వ్యవస్థ



మురుగు నీటితో నిండిన డ్రైయినేజీ





దుర్కి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- దుర్కి ఇందిరమ్మకాలనీలో కంపుకొడుతున్న వీధులు
- పెరిగిన దోమలు.. రోగాల పాలవుతున్న జనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 2006లో ప్రభుత్వం 110 మంది నిరుపేదలకు స్థలాలు కేటాయించారు. ప్రస్తుతం వంద మందిపైగా ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారు. కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక కాంట్రాక్టర్ ఇష్టారీతిన కట్టడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దీనితో మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇంట్లో వారానికి ఒకరు ఆస్పత్రుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

పత్తా లేని ప్రత్యేక అధికారి..

గ్రామంలో సమస్యలు తిష్ట వేస్తున్నా కూడా ప్రత్యేక అధికారి కన్నెత్తి చూడటం లేదని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా నామమాత్రంగా వస్తున్నారే కాని పరిష్కార మార్గం చూపడం లేదంటున్నారు.

వీధులన్నీ కంపుకొడుతున్నాయి

20 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. డ్రైయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. దీంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి. వీధులన్నీ మురుగు నీటితో నిండిపోయి ని త్యం ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మా గో డు పట్టించుకోవాలి.

– స్వరూప రాణి, ఇందిరమ్మ కాలనీ, దుర్కి

దోమలతో సావాసం చేస్తున్నాం

మురికి కాలువలలో నీరు నిలవడంతో దోమలు పేరుకుపోతున్నాయి. సా యంత్రం ఉక్కపోతకు వీధిలో కూర్చోవాలంటే దుర్వాసన వస్తోంది. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నాం. మా సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– జమత్, ఇందిరమ్మ కాలనీ, దుర్కి

సమస్య పరిష్కరిస్తాం

దుర్కిలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ గురించి మా దృష్టికి రాలేదు. వెంటనే కాలనీ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తాను.

– సూర్యకాంత్, ఎంపీడీవో, నస్రుల్లాబాద్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బిచ్కుందలో పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని 13వ వార్డుల్లో సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్లకు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకులు సాహిల్ షెట్కార్, తుకారాం, ఖలీల్, సాయిలు, సాయిని అశోక్, గంగారాం పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లిలో గురువారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నేత రమేశ్ రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిలు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులు అందజేయాలి

బాన్సువాడ రూరల్/రాజంపేట/నిజాంసాగర్: రాజీవ్ యువ వికాస్ పథకంలో భాగంగా మీ–సేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు కంప్యూటర్ అప్లికేషన్ ఫారంతో పాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు వివరాల జిరాక్సు ప్రతులను మండల కార్యాలయంలో అందజేయాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్, రాజంపేట ఎంపీడీవో రఘురాం, మహమ్మద్ నగర్ ఎంపీడీవో అనితలు వేర్వేరుగా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అందజేసిన దరఖాస్తులను గ్రామాలు, వార్డుల వారీగా క్రోడీకరించి అర్హుల గుర్తింపునకు సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు.

చలో వరంగల్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): వరంగల్‌లో ఈ నెల 27న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా గురువారం లింగంపేట మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. వరంగల్ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాములు, శ్రీకాంత్, గాండ్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడానికే భూభారతి



లింగంపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించడానికి భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చినట్లు ఆర్డీవో మన్నె ప్రభాకర్ వెల్లడించారు. గురువారం ఆయన కొర్పోల్, లింగంపల్లి(ఖుర్దు) గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని మాట్లాడారు. రైతులు భూ సమస్యలకు సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. లింగంపల్లి(ఖుర్దు)లో 261, కొర్పోల్లో 75 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సురేష్, ఆర్ఐ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

హన్‌మాన్ దేవాలయం నిర్మాణానికి భూమి పూజ



భిక్కనూరు: కాచాపూర్‌లో నూతనంగా హన్‌మాన్ దేవాలయం నిర్మాణానికి గురువారం హన్‌మాన్ స్వాముల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణాల మధ్య భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఏడాదిలోపు ఆలయాన్ని సుందరంగా నిర్మింపజేస్తామని గ్రామస్తులు తెలిపారు.

సత్యసాయి భక్తుల నారాయణ సేవ

కామారెడ్డి అర్బన్: సత్యసాయిబాబా శత జయంతి, ఆరాధన ఉత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని భక్తులు వివిధ ప్రాంతాల్లో అన్నదానం, జలసేవ, అంబలి పంపిణీ నారాయణ సేవ నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పనగర్‌లోని వంద నిమిషాల పాటు సత్యసాయి భజనలు చేశారు.

రేపు గాంధారిలో ఉచిత వైద్య శిబిరం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ సత్యం తెలిపారు. హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులతో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 మంది ప్రత్యేక వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్ని రకాల పరీక్షలు చేస్తారన్నారు. అవసరం ఉన్న మందులు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జొన్నల కొనుగోలు పరిమితి పెంచడంపై హర్షం



కాటేపల్లిలో సీఎం, ఎమ్మెల్యే, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



చిన్నకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జొన్నల కొనుగోలు పరిమితి ఎకరానికి 8 నుంచి 14 క్వింటాళ్లకు ప్రభుత్వం పెంచడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం కాటేపల్లిలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులందరు కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సొసైటీ చైర్మన్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ గంగాగౌడ్, కార్యదర్శి హన్మండ్లు, ఏఈవో రూప తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్గల్ సొసైటీ వద్ద గురువారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నాగిరెడ్డి ప్రారంభించారు.జొన్నల కొనుగోలు పరిమితి ఎకరానికి 8 నుంచి 14 క్వింటాళ్లకు ప్రభుత్వం పెంచడంతో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రం



మంగ్లూర్‌లో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏలె మల్లికార్జున్

నిజాంసాగర్(జుక్కల్): రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వ పరంగా జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. గురువారం మంగ్లూర్‌లో అచ్చంపేట సొసైటీ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు లక్ష్మారెడ్డి, దత్తు, సాయిలు, ఆగమయ్య, సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

హరిజనవాడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: పట్టణంలోని హరిజనవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 26వ వార్డు హరిజనవాడలో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నీటి సమస్య, మురికి కాలువ, రోడ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎండాకాలం నేపథ్యంలో మున్సిపల్ అధికారులతో మాట్లాడి వాటర్‌ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా చేయిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఉద్యోగ నియామకాలపై విచారణ జరపాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరిగాయని.. విచారణ చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు మాట్లాడుతూ.. రూ.కోటికి పైగా కుంభకోణం జరిగిందని, డబ్బులు తీసుకుని ఉద్యోగ నియామకాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో బాధిత అభ్యర్థులు రవి, అరవింద్ తదితరులున్నారు.

'జనం బాధలకు అక్షర రూపం ఇవ్వాలి'



కామారెడ్డి అర్బన్: సామాజిక బాధ్యతతో రచనలు చేయాలని, జనం బాధలకు అక్షరాల్లో పరిష్కారం ఇవ్వాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక విద్యానగర్‌లోని సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా భవనంలో తెరవే ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సాహిత్యం ఒక సృజన ప్రక్రియని, దీని ద్వారా సమాజాన్ని మరింత చైతన్యం చేయవచ్చని పలువురు కవులు తమ కవితాగానం ద్వారా తెలిపారు. తెరవే ప్రతినిధులు వై.గంగాప్రసాద్, కాసర్ల రామచంద్రం, వైద్య శేషారావు, నాగభూషణం, కాశ నరసయ్య, తిరుపతిరావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ బాన్సువాడ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెజగం వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా ఖాలిద్, కోశాధికారిగా భూనేకర్ గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్లుగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా విశేష సేవలందించిన డాక్టర్ అంజిరెడ్డి, కాచం శ్రీనివాస్‌లను అభినందించారు. లయన్స్ సభ్యులు హన్మంత్‌రావు, లక్ష్మారెడ్డి, జీవన్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, భూనేకర్ ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, తాటిరాము, బెజుగం భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై కలెక్టర్ స్పందన



పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చిన గన్నీ బ్యాగులను తిరగ మరగ చేసి స్టాంపు వేయడంలో తలెత్తుతున్న ఆర్థిక భారం గురించి గురువారం మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డీసీఎంవోతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ ప్రవీణ్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచులను తిరగమరగ చేసి స్టాంపు వేస్తున్నారని రైతులతో వివరించడంతో వారు సంతృప్తి చెందారు. మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, రైతులు సలీం, లక్ష్మీనారాయణ, అంజనేయులు, మధు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



ఆరేడ్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవోలు

నిజాంసాగర్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తుల చేసుకున్న వారు ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉండాలని ఎంపీడీవోలు గంగాధర్, శ్రీనివాస్ సూచించారు. గురువారం నిజాంసాగర్ మండలం ఆరేడ్, జుక్కల్ మండలం చండేగావ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్థలాలను ఎంపీడీవోలు పరిశీలించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి

రాజంపేట: గ్రామాలలో నిజమైన పేదవారికే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలని ఎంపీడీవో రఘురాం అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు శివాయిపల్లి, ఆరేపల్లి గ్రామాలలోని ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను ఆయన పరిశీలించారు.

లక్ష్మాపూర్‌లో ..

ఎల్లారెడ్డి: లక్ష్మాపూర్‌లో ఎంపీవో ప్రకాష్ గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన వారి వివరాలను పరిశీలించారు.

లింగంపేట పరిధిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్, అయిలాపూర్, బాణాపూర్ గ్రామంల్లో గురువారం ఎంపీడీవో నరేష్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికి వెళ్లి విచారణ చేశారు. లబ్ధిదారుల ఎంపిక కోస వారి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. విచారణ అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో వెంట ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

కాటేపల్లిలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అర్హులైన ప్రతి ఇక్కరు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పనులు ప్రారంభించాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. గురువారం కాటేపల్లిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.

సలాబత్‌పూర్ ఆలయ హుండీ లెక్కింపు



సలాబత్‌పూర్‌లో డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలోని హుండీల లెక్కింపును అధికారులు గురువారం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మెన్ రాంపటేల్, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలను విప్పి లెక్కించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆలయంలోని హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్ తెలిపారు. హుండీ ద్వారా రూ.5,09,370 నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. నాయకులు హన్మండ్లు స్వామి, ఆలయ సిబ్బంది, భక్తులున్నారు.

సంక్షిప్తం

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పిట్లం(జుక్కల్): ప్రతి సంవత్సరం నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం పిట్లం మండలంలో నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి సంతోష్ పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం, హస్నాపూర్ గ్రామాల్లో ఉచిత గాలికుంటు వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించి 120 గేదెలు, 60 ఆవులకు టీకాలు వేశారు.

లింగంపేట మండలం జల్దిపల్లిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): జల్దిపల్లిలో గురువారం మండల పశు వైద్యాధికారి హన్నాహ జాన్సన్ పశువులకు టీకాలు వేశారు. 55 ఆవులు, 45 గేదెలకు టీకాలు వేసి సాధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వెటర్నరీ అసిస్టెంట్ రవి, గోపాలమిత్రలు ఎజాస్, శివలాల్, రైతులు పాల్గొన్నారు.



బాధితుడికి నిత్యావసర వస్తువుల అందజేత



ఎల్లారెడ్డిరూరల్: రేపల్లెవాడ గ్రామానికి చెందిన కుర్మ నాగయ్యకు సంబంధించిన నివాసపు గుడిసె కాలిపోవడంతో బాధితుడికి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం నిత్యావసర వస్తువులతో పాటు, కుటుంబ సభ్యులందరికి దుస్తులు, దుప్పట్లు అందించారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

స్కావెంజర్‌కు డబ్బులు చెల్లించిన హెచ్ఎం

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ ఎస్సీవాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంజీవ్ గురువారం స్కావెంజర్‌కు డబ్బులు చెల్లించారు. సాక్షి దినపత్రికలో గురువారం స్కావెంజర్ డబ్బులు కాజేత...అనే వచ్చిన శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. విచారణ చేపట్టి హెచ్ఎం ద్వారా రాతపూర్వకంగా వివరణ లేఖ తీసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. దీంతో ఎంఈవో.. స్కావెంజర్ నసీమా బేగం, చైర్మన్ రాంబాయి, హెచ్ఎం సంజీవ్ ముగ్గురుని ఎంఆర్సీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. స్కావెంజర్‌కు ఇవ్వాల్సిన డబ్బులు హెచ్ఎం తిరిగి చెల్లించి రాతపూర్వకంగా వివరణ లేఖను అందించారు.